క్లుప్తంగా

ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ మహేశ్వరరావు

మొగల్తూరు: మిచాంగ్ తుపాను ప్రభావం దృష్ట్యా ఆరోగ్య శాఖ వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డి.మహేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం మొగల్తూరు పీహెచ్‌సిలో ఏర్పాటు చేసిన సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. తుపాను దృష్ట్యా నియోజకవర్గంలో 14 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. తూర్పు తాళ్లలో 10, ఎల్‌బీ చర్లలో 2, మొగల్తూరు పీహెచ్‌సీలో 2 శిబిరాలు ఏర్పాటు చేశామని 55 మంది పారావైద్య సిబ్బందిని ఆరుగురు వైద్యాధికారులను అందుబాటులో ఉంచామన్నారు. 18 మంది గర్భిణులను వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. తమ సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ వి.ప్రసాద్, డాక్టర్ కె.లక్ష్మీపార్వతి ఎంపీహెచ్‌ఓ కేబీకేఎస్ రమేష్ రెడ్డి, ఏఎస్ఎస్ ఎస్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కూడా కొనుగోలు



బల్లిపాడులో తడిసిన ధాన్యం రాశులను పరిశీలిస్తున్న గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు రైతులకు ధైర్యం చెప్పారు. పాలకొల్లు మండలం బల్లిపాడు, తిల్లపూడి గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించి పలువురు రైతులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. మిచాంగ్ తుపాను నేపథ్యంలో కురిసిన భారీ వర్షాలకు రైతుల పంటచేలల్లో వర్షం నీరు నిలిచిపోయింది. పంట చేలు నేలనంటాయి. పంటచేలపై వర్షం నీరు నిలిచిపోవడాన్ని గుడాల గోపి స్వయంగా పరిశీలించారు. తడిసిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం మంజూరు విషయంలోనూ, అలాగే ఇన్సూరెన్స్ విషయంలోనూ రైతులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. ఆయన వెంటే జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, దెందులూరు పార్టీ పరిశీలకుడు యడ్ల తాతాజీ, పార్టీ నాయకులు భూపతిరాజు వేణుగోపాలరాజు పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ సెలక్షన్స్



ఎస్వీకేపీలో మెన్ అండ్ విమెన్ బాక్సింగ్ సెలక్షన్స్ ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

పెనుగొండ: కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో మెన్ అండ్ వుమెన్ బాక్సింగ్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ నిర్వహించి, ప్రతిభ ఉన్న క్రీడాకారులను ఎంపిక చేస్తున్నట్లు పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్‌రాజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు తెలిపారు. మంగళవారం కళాశాలలో టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. 86 మంది క్రీడాకారులు పాల్గొంటారని, వీరి నుంచి 13 మంది బాలురను, 12 మంది బాలికలను ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ జాయింట్ సెక్రటరీ కోచ్ సెలెక్షన్ కమిటీ సభ్యుడు సీహెచ్ చంద్రశేఖర్, సెలెక్షన్ కమిటీ సభ్యులు రాజోలు ప్రభుత్వ కళాశాల పీడీ డాక్టర్ బి.మధుకుమార్, భీమవరం ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల పీడీ డాక్టర్ ఎస్.ధనుంజయ్, రెఫరీ బాక్సింగ్ కోచ్ కె.చిరంజీవి, పరిశీలకుడు డాక్టర్ బీవీ నరసింహ, సూపరింటెండెంట్ ఎస్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ



సాయిబాబా పాలరాతి విగ్రహ గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఆకివీడు : స్థానిక బైపాస్‌రోడ్డులోని వెంకయ్య వయ్యేరు పంట కాలువకు చేర్చి సాయి మందిర పునఃప్రాణప్రతిష్ఠ, సాయిబాబా పాలరాతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆలయం వద్ద సాయి కోటి నామ లిఖిత మహా యజ్ఞం జరిగింది. గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక లయన్స్ ప్రతినిధి సన్నిధి వెంకన్నబాబు, లక్ష్మీ రాజ్యం దంపతులు విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పాలకొల్లు అర్బన్: వడ్లవానిపాలెంలో నేలకొరిగిన వరి చేను



పాలకొల్లు అర్బన్: వెలివెలలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు



నరసాపురం రూరల్: లిఖితపూడిలో నేలకొరిగిన భారీ వృక్షం

వణికించిన మిచాంగ్

- తుపాను దెబ్బకు జనజీవనం అస్తవ్యస్తం
- నీట మునిగిన చేలు, నేలకొరిగిన వృక్షాలు
- సహాయక చర్యల్లో అధికారులు, నాయకుల నిమగ్నం

మొగల్తూరు: మిచాంగ్ తుపాను ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తుంది. మొగల్తూరు మండలంలో ఆదివారం రాత్రి నుండి మంగళవారం ఉదయం వరకూ సుమారు 72.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షంతో పాటు ఈదురుగాలులుకూడా వీయడంతో మండలంలో పలు గ్రామాల్లో చేతికి అందివచ్చిన వరిపంట నీటి పాలైంది. ముఖ్యంగా రామన్నపాలెంలో చేలు నేలకొరగడంతో పాటు నీటి మునిగాయి. మొగల్తూరు పంచాయతీ నక్కావారిపాలెంలో ధాన్యం రాశులు తడిచిపోయే అవకాశం ఉండడంతో బరకాలు కప్పారు. పాతపాడులో భారీ వర్షాలకు గ్రామంలోని ప్రధాన రహదారుల్లో వర్షం నీరు నిలిచింది. అలాగే మొగల్తూరులోని కోనాయికోడు పొంగిపొర్లడంతో వేగివారిపేటలోకి వర్షం నీరు చేరింది. మరోవైపు తుపాను దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

లిఖితపూడిలో రాకాసి గాలులు బీభత్సం

నరసాపురం రూరల్: మండలంలోని లిఖితపూడి గ్రామంలో మంగళవారం (రాకాసి గాలులు) టోర్నడో బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం సమయంలో విపరీతంగా గాలులు వీస్తూ పెద్ద శబ్దం చేస్తూ సరిపల్లి గర్వు ప్రాంతం నుంచిలిఖితపూడి మీదుగా మల్లవరం పెదలంక గ్రామం మీదుగా ఈ సుడిగాలి భారీగా గాల్లోకి లేచింది. పెద్దగా శబ్దం చేస్తూ ఒక్క సారిగా విరుచుకుపడిన ఈ సుడిగాలి దాటికి లిఖితపూడిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు ఇళ్ల పైకప్పులు గాల్లోకి లేచి పడ్డాయి. విద్యుత్ తీగలు తెగి రోడ్డుపై చెల్లా చెదురుగా పడ్డాయి. పదుల సంఖ్యలో భారీ వృక్షాలు, నేలమట్టమయ్యాయి. ముఖ్యంగా కొబ్బరి చెట్లు భారీగానే నేలకు ఒరిగి ఉండవచ్చునని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. రోడ్డు పక్కనే మల్లవరం లంక వెళ్లే రహదారిలో ఉన్న పలు ఇళ్ల పైన కప్పులు గాల్లో ఎగిరిపోవడంతో ఇళ్లల్లో నివసించే వారు కట్టుబట్టలతో బయటకు వచ్చారు. ఎన్నడూ లేనిది ఈ రాకాసి గాలలు పెద్ద ఎత్తున రావడంతో ఆ గాలలు తమవైపుకే దూసుకు వస్తాయేమోననే భయంతో పెద్ద ఎత్తున జనం పరుగు తీశారు. అలాగే సరిపల్లి, మల్లవరం, మల్లవరం లంక, కొప్పర్రు తదితర గ్రామాల్లో పంట చేలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. వ్యవసాయశాఖ ఏడీఏ ఈదా అనిలకుమారి, లో రాజశేఖర్ నరసాపురం, మొగల్తూరు మండాలాల్లో పర్యటించారు. నరసాపురం మండలంలో 1,261 హెక్టార్లు, మొగల్తూరు మండలంలో 280హెక్టార్లు, యలమంచిలి మండలం లో239 హెక్టార్లులలో పంట నీట మునిగి, నేలనంటింది. భారీ వర్షానికి తోడు లిఖితపూడి ప్రాంతంలో రాకాసి గాలులు వీయడంతో పంట పూర్తిగా ధ్వంసం అయ్యింది. అలాగే భారీ వర్షానికి ఎల్బీచర్ల ప్రధాన రహదారి, నవరసపురం రహదారి, కొప్పర్రు, మల్లమవరం తదితర గ్రామాల్లోని పలు ప్రాంతాల రోడ్లన్నీ నీటమునిగాయి.



నరసాపురం రూరల్: లిఖితపూడిలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు



నరసాపురం రూరల్: కొప్పర్రులో నేలనంటిన వరి చేను



నరసాపురం రూరల్: లిఖితపూడిలో రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షం



ఆచంట: కొడమంచిలిలో రైతులకు సాయం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: ప్రజలను ఒణికించిన మిచాంగ్ తుపాను మంగళవారం సాయంత్రానికి బాపట్లలో తీరం దాటే సమయంలో పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో విలయం సృష్టించింది. పాలకొల్లులో వీచిన ఈదురు గాలులకు కొబ్బరి చెట్లు, పెద్ద పెద్ద వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కొన్ని చోట్ల కొబ్బరి చెట్లు ఇళ్లపైన, రేకుల షెడ్లపైన, విద్యుత్ స్థంభాలపైన పడడంతో ప్రమాదకరంగా పరిణమించాయి. పట్టణంలో పలు రహదారులు వర్షం నీటితో జలమయమయ్యాయి. పట్టణంలో ఉదయం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వ్యాపారస్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రాత్రికి విద్యుత్ సరఫరా ఇచ్చినా విద్యుత్ వైర్లపై చెట్లు పడిపోవడంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. విద్యుత్ స్తంబాలపై చెట్లు స్థంబాల కింద నీళ్ల ఉండడంతో విద్యుత్ సిబ్బంది తమ విదులు నిర్వర్తించడానికి చాలా ఇబ్బందులకు గురయ్యారు. ఆ చీకట్లోనే తమ పనులు చేయడానికి విద్యుత్ సిబ్బంది సమాయత్తమయ్యారు. పట్టణంలో బస్టాండ్, బ్రాడీపేట, లక్ష్మీనగర్, ఓల్డ్ బ్యాంక్ కాలని, హౌసింగ్‌బోర్డు కాలని, మార్కెటింగ్ యార్డ్ రోడ్డు, బంగారువారి చెరువు గట్టు ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. బస్టాండ్ వద్ద చెరువును తలపించే విధంగా వర్షం నీరు నిల్వ ఉండిపోయింది. అచ్చుగట్లపాలెం పాత బ్యాంక్ కాలనీ వద్ద పనసరామయ్య తోట ప్రాంతంలో కొబ్బరి చెట్టు విద్యుత్ వైర్లపై పడి ఉండడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అలాగే సూర్యతేజస్ నగర్‌లో చెట్లు పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

పెనుగొండలో...

పెనుగొండ: మిచాంగ్ తుపాను తీవ్రతతో రైతులకు అండగా అటు అధికార యంత్రాంగం ఇటు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాలతో ఎప్పటికపుడు పరిస్థితి పర్యవేక్షిస్తూ రక్షణ చర్యలు చేపట్టారు. పెనుగొండ, ఆచంట మండలాల్లో వర్షపు నీరు రాశుల వద్ద చేరకుండా, పంట కాలువలు పొంగకుండా జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉపాధి కూలీలతో గ్రామాల్లో బోదేలు తవ్వడం, చేలోకి చేరిన నీరు బయటకుపోయే విధంగా షేడీలు ఏర్పాటు చేయడం చేస్తున్నారు. పెనుగొండ, ఆచంట వ్యవసాయాధికారులు పి.స్పందన, నాగరాజు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గ్రామాల్లో పర్యటిస్తూ ధాన్యాన్ని సమీపంలోని రైసు మిల్లులకు చేర్చడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

రైతులకు అండగా నిలవాలి

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు నియోజకవర్గంలో మంగళవారం పర్యటించి రైతులకు అండగా సేవలు అందించాలని నాయకులకు సూచించారు. ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కొడమంచిలి, ములపర్రుల్లో నాయకులు పర్యటించి రైతులకు నాయకులు అండగా నిలిచారు. ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, ఎంపీటీసీ సభ్యుడు యల్లమెల్లి బేబీ రాజేష్, రైతు సంఘ అధ్యక్షుడు మన్నే సుబ్బారావు, చిలుకూరి శ్రీనివాస్, యాండ్ర శ్రీనులు వరిచేలను పరిశీలిస్తూ అధికారులకు సహకరించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: మిచాంగ్ తుపాను తీరం దాటే సమయంలో వీచిన సుడిగాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో పాలకొల్లు మండలంలోని వెలివెల, శివదేవునిచిక్కాల, తిల్లపూడి గ్రామాల్లో కొబ్బరి చెట్లు, ఉద్యాన పంటలు, విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. తిల్లపూడి పంచాయతీ పరిధిలోని సానివాడలో గురుజు రామాయమ్మకు చెందిన ఇల్లు పైకప్పు లేచిపోయింది. రెండు పశువుల పాకలు కూలిపోయాయి. అలాగే తిల్లపూడి- శివదేవుని చిక్కాల గ్రామాల మధ్య సుమారు 200కి పైగా కొబ్బరిచెట్లు, ఉద్యాన పంటలు నేలమట్టమయ్యాయి. తిల్లపూడి, వెలివెలలో విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకి తీవ్ర అంతరాయం ఏర్పడింది. తిల్లపూడి-శివదేవునిచిక్కాల గ్రామాల మధ్య రోడ్డుపై చెట్లు అడ్డంగా పడిపోయాయి. అలాగే వెలివెలలో రైతులకు చెందిన సుమారు 80 కొబ్బరిచెట్లు నేలమట్టమయ్యాయి. వీటిని తొలగించడానికి రెవెన్యూ, పంచాయతీ అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆదేశాల మేరకు తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు, ఆర్ఐ కవురు వరలక్ష్మి, ఈఓపీఆర్‌డీ కేఎం వైభవతి ఆ గ్రామాల్లో పర్యటించి పంచాయతీ, రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేశారు. చెట్లు తొలగింపునకు పాలకొల్లు నుంచి ఫైర్ ఇంజిన్, ప్రొక్లైయిన్ సహాయంతో రాత్రికి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

యలమంచిలిలో..

యలమంచిలి: మిచాంగ్ తుపాను గ్రామాలను ముంచెత్తుతోంది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం సోమవారం రాత్రి నుంచి ప్రారంభమై మంగళవారం రోజంతా ఎడతెరిపి లేకుండా కురుస్తునే ఉంది. ముఖ్యంగా వరిపంటకు భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటివరకు 217 ఎకరాల్లో వరి పంట నీట మునగగా మరో 374 ఎకరాల్లో నేలనంటినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. భారీ వర్షానికి శిరగాలపల్లిలోని ఒక పెంకుటిల్లు పాక్షికంగా దెబ్బతింది. దొడ్డిపట్లలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగింది.

రెండో రోజూ తగ్గని తీవ్రత

పెనుగొండ: మిచాంగ్ తుపాను ప్రభావం రెండవ రోజు మంగళ వారం కొనసాగింది. సోమవారం కురిసిన భారీ వర్షానికి పెనుగొండ, ఆచంట మండలంల్లో వరిచేలునేలకొరిగి నీట మునిగాయి. కొడమంచిలి, పెదమల్లం, కరుగోరిమిల్లి, కందరవల్లి, ఆచంట, వల్లూరు, ఆచంట వేమవరం, పెనుమంచిలి, శేషమ్మ చెరువుల్లో భారీగా వర్షం కురిసింది. దీంతో వరిచేలు నేలనంటడంతో చేతికందిన పంట నీటి పాలవుతుందంటూ రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలో ఇప్పటి వరకూ ప్రాథమికంగా 550 ఎకరాల పంట నేల కొరిగినట్లు గుర్తించినట్లు వ్యవసాయ విస్తరణాధికారి వి.నాగరాజు తెలిపారు. ముఖ్యంగా స్వర్ణ, ఎంటీయూ 1318 రకాలు నేలనంటుతున్నాయని తెలిపారు. పెదమల్లంలో మంగళవారం సాయంత్రం టోర్నడో తీవ్ర ప్రభావం చూపింది. దీంతో చెట్టుకొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి, కొన్ని ప్రాంతాల్లో అరటి చెట్లు నేలకొరిగాయి.



పెనుగొండ: ఆచంట మండలం వల్లూరు నేలకొరిగిన వరిచేనును చూపుతున్న రైతు



పాలకొల్లు అర్బన్: తిల్లపూడి పంచాయతీ సానివాడలో గురుజు రామాయమ్మకు చెందిన రేకుల షెడ్డు పై కప్పు లేచిపోయిన దృశ్యం



పాలకొల్లు అర్బన్: తిల్లపూడి - శివదేవునిచిక్కాల ఆర్‌అండ్‌బీ రోడ్డుకి అడ్డంగా పడిన కొబ్బరిచెట్లు

తుపాను పరిస్థితులను ఎదుర్కొంటాం

నరసాపురం: జిల్లాలో తుపాను ప్రభావ పరిస్థితులు సమర్థవంతంగా ఎదుర్కొవడానికి అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుందని జిల్లా ప్రత్యేక అధికారి, మత్స్యశాఖ కమిషనర్ కె.కన్నబాబు చెప్పారు. మంగళవారం నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అధికారులకు తగు సూచనలు చేశారు. తుపాను తరువాత పరిస్థితి యధాస్థితికి వచ్చే వరకూ బాధితులు పునరావాస కేంద్రాల్లో ఉండాలని కోరారు. ముఖ్యంగా నరసాపురం, ఆచంట, మొగల్తూరు మండలాల్లో ఎక్కువ ఎఫెక్ట్ ఉందన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే పంట, ఇతర నష్టాలు అంచనా వేస్తామని చెప్పారు. ఆయన వెంట నరసాపురం ఆర్డీఓ ఎంఏ అంబరీష్, మండల ప్రత్యేక అధికారి వి.విజయలక్ష్మి, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌బీఎస్ ప్రసాద్ ఉన్నారు.



వంట ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి కన్నబాబు, ఆర్డీవో ఎంఏ అంబరీష్

పోడూరులో...

పోడూరు: మండలంలో జగన్నాథపురం గ్రామంలో పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్యేక అధికారి, మత్స్య శాఖ కమిషనరు కె.కన్నబాబు మంగళవారం పర్యటించారు. మిచాంగ్ తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న వరిచేలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓ ఎంఏఅంబరీష్, ప్రత్యేక అధికారి డి.సావిత్రి, తహసీల్దారు ఆర్‌వీ కృష్ణారావు, ఎంపీడీఓ డి.సుహాసిని ఉన్నారు.

పశువులకు టీకాలు

పోడూరు: మిచాంగ్ తుపాను ప్రభావంతో వాతావరణంలో మార్పులు రావడంతో పశువులకు దొమ్మ వ్యాధి రాకుండా నివారణ టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్య అధికారి డా.ఎస్ మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం మండంలోని వద్దిపర్రు గ్రామంలో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ పంట కాలువలు, మురుగు కాలువలు, పరివాహక గ్రామాలలోని కలుషిత నీటి వల్ల దొమ్మ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని, అందువల్ల రైతులందరూ తమ పశువులకు టీకాలు వేయించాలని కోరారు. ఏ రైతుకు చెందిన పశువైనా చనిపోతే సంబంధిత రైతు భరోసా కేంద్రం లోని పశు సహాయకుడికు, వీఆర్వో ద్వారా పశు వైద్యులకు సమాచారం అందిస్తే నష్టపరిహారం అందజేస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, గోపాల మిత్ర రాపాక సుబ్బారావు పాల్గొన్నారు.



పశువులకు టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న మండల పశు వైద్యాధికారి డాక్టర్ మహేష్ కుమార్

రైతులకు అండగా సీఎం జగన్

పెనుగొండ: అకాల వర్షంతో ఏ ఒక్క రైతు నష్టపోకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రక్షణ చర్యలు చేపట్టారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు భరోసా ఇచ్చారు. మంగళవారం ఆచంట నియోజకవర్గంలో నీట మునిగిన పలు గ్రామాల్లోని వరిచేలను పరిశీలించారు. ముందస్తు సమాచారంతో అధికారులను అప్రమత్తం చేసి నష్ట నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు, ధాన్యం విక్రయాల్లో నిబంధనలు సడలించి రైతులకు అండగా నిలిచారన్నారు. ప్రతీ జిల్లాకు తుపానుకు గాను ప్రత్యేకాధికారులను నియమించడంతో పాటు, జిల్లా కలెక్టర్లను అప్రమత్తం చేశారన్నారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు, వారికి కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేశారన్నారు. పంట నష్ట వివరాలు ఎప్పటికపుడు పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. తేమతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరిగిందన్నారు. నియోజకవర్గంలో సుమారు 3 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించడం జరిగిందన్నారు. రాశుల్లో ఉన్న ధాన్యాన్ని రైతులు వర్షం తెరిపి ఇచ్చిన అనంతరం సత్వరం తరలించడానికి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆచంట ఏఎంసీ వైస్‌ఛైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, మినిమించిలిపాడు సర్పంచ్ ఆర్.వీర్రాజు, వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు కర్రి వేణుబాబు, గెద్దాడ ఏకలవ్య, మురళీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో ఉమా సోమేశ్వర స్వామి



ఉమాసోమేశ్వర స్వామి

భీమవరం (ప్రకాశంచౌక్): కార్తీక మాసోత్సవాల్లో భాగంగా 22 రోజు మంగళవారం గునుపూడి పంచారామ క్షేత్రం సోమేశ్వర జనార్దన స్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అభిషేకాలు, హోమాలు, దర్శనం టిక్కెట్లు, ప్రసాద విక్రయాల ద్వారా రూ.9,450 ఆదాయం లభించినట్లు ఈఓ డి.కృష్ణంరాజు తెలిపారు. ఏర్పాట్లను ధర్మకర్తల మండలి సభ్యులు కుర్మదాసు సత్యశ్రీనివాస్, నాచుశ్రీవల్లి, లక్కు త్రిమూర్తులు, కోయతాతాజీ, నల్లం రఘుబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్, సోమాదుల లీలా ఈశ్వరి, తానాల రామకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

ముంపు చేల పరిశీలన

కాళ్ల: తుఫాను ప్రభావంతో నీట మునిగిన వరి పంట పొలాలను జిల్లా కలెక్టర్ ప్రశాంతి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. కాళ్ల మండలం సీసలి గ్రామంలో నేల కొరిగిన వరిచేలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. మండలంలో ప్రధాన డ్రెయిన్ మొగదిండి తూడు, గుర్రపు డెక్కతో పూడుకుపోవడంతో ముంపు సమస్య తలెత్తిందని రైతులు కలెక్టర్‌కు వివరించారు. మండలంలో 3878 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఇందులో 1,100 ఈదురుగాలులకు పడిపోయిందని, మరో 1200 ఎకరాల పంట నీట మునిగినట్టు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. బుధ, గురువారాల్లో ఎగువ ప్రాంతాల వర్షపునీటి వల్ల పంటనష్టం మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. ముంపు నీటిని మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జేసి ఎస్ రామసుందరరెడ్డి, ప్రత్యేక అధికారి కన్నబాబు, ఆర్డీఓ శ్రీనివాసులురాజు, వ్యవసాయశాఖ జేడీ జెడ్ వెంకటేశ్వరరావు ఉన్నారు.